క్లుప్తంగా

మహిళల భద్రతకు ప్రాధాన్యం


మాట్లాడుతున్న ఎస్ఐ నరేంద్ర

పరిగి: మహిళల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించడంతో పాటూ దిశ చట్టాన్ని ప్రవేశపెట్టిందని ఎస్ఐ నరేంద్ర తెలిపారు. మండలంలోని కాలువపల్లి వద్ద ఉన్న నిషా గార్మెంట్స్ పరిశ్రమలో మంగళవారం మహిళా కార్మికులకు ఎస్ఐ ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చట్టాలతో పాటు మహిళలకు ఉన్న హక్కులపై అవగాహన కల్పించారు.

బాలికల భద్రత సామాజిక బాధ్యత

అగళి: బాలికల భద్రత సామాజిక బాధ్యత అని మడకశిర ప్రాజెక్టు సీడీపీఓ నాగమల్లేశ్వరి, ఈఓఆర్డీ పద్మ పేర్కొన్నారు. మండల పరిధిలోని మాదుడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆర్డీటీ మహిళా విభాగం ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాన్ని నిర్వహించారు. సమాజంలో ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


కారు ఢీ కొనడంతో దెబ్బతిన్న ద్విచక్ర వాహనం

పెనుకొండరూరల్: పట్టణ సమీపంలోని బెహలూల్‌షా దర్గా సమీపంలో 44వ జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మూర్తి అనే వ్యక్తి గాయపడ్డాడు. పెనుకొండ పట్టణానికి చెందిన మూర్తి సోమందేపల్లి వైపు నుంచి స్కూటర్‌లో పెనుకొండకు వస్తుండగా బెంగళూరు వైపు నుంచి అనంతపురం వైపు వెళుతున్న కారు వెనుక నుంచి ఢీ కొంది. మూర్తికి తీవ్రంగా గాయపడగా స్థానిక ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ రమేష్ తెలిపారు.

యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టు భర్తీకి ఇంటర్వ్యూ రేపు

హిందూపురం టౌన్: మండలంలోని సంతేబిదనూరు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో తాత్కాలిక ప్రాతిపదికన యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టు భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు వైద్యశాల వైద్యాధికారి అనురాధ పేర్కొన్నారు. ఈ నెల 14న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ సంతేబిదనూరులోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. యోగాలో ఎమ్మెస్సీ , యోగ ఇన్‌స్ట్రక్టర్ కోర్సు ఉత్తీర్ణులైన వారు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

ఉచిత వైద్య శిబిరం


రక్త పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని కిరికెరలోని రామచంద్రనగర్‌లో మంగళవారం వాసవ్య మహిళా మండలి విప్రో కేర్ సహకారంతో కుశాల్ హెల్త్ కేర్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులకు ఉచితంగా వైద్య సేవలు, రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ గౌతమి, సర్పంచ్ భాగ్యమ్మ, మరియమ్మ, రామలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు


డబ్బు లెక్కిస్తున్న దృశ్యం

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి సిద్ధేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం హుండీని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ నరసింహరాజు, ఈఓ నాగేంద్ర ప్రసాద్, ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ ఆధ్వర్యంలో లెక్కించారు. మొత్తం రూ.2,46,128 ఆదాయం వచ్చిందని తెలిపారు.

సామాజిక తనిఖీపై అవగాహన

రొద్దం: మండల వ్యాప్తంగా జరుగనున్న గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన రూ.13 కోట్ల పనులపై బుధవారం నుంచి సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ చెప్పారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు భవనంలో కోఆర్డినేషన్‌పై సమావేశం నిర్వహించారు.

హలో.. హలో.. హలో !

- చిలమత్తూరు మండలంలో మొబైల్ సర్వర్లు డౌన్
- సిగ్నళ్లు సరిగా అందక వినియోగదారుల అవస్థ
- రూ.వందలతో రీచార్జ్ చేస్తున్నా ప్రయోజనం లేదని ఆవేదన

» ఇటీవలే ఓ వ్యక్తి అత్యవసరంగా బ్యాంక్ ఖాతా తెరవాల్సి ఉండగా వెంటనే కొడికొండ చెక్‌పోస్ట్‌లోని ఏపీజీబీ బ్యాంక్‌కు వెళ్లాడు. అక్కడ ఖాతా తెరిచేందుకు అవసరమైన ఓటీపీ కోసం అరగంట వేచి చూడాల్సి వచ్చింది. మొబైల్ నెటవర్క్ సరిగా లేకపోవడంతో ఓటీపీ రాక ఇబ్బందులు పడ్డాడు.

» చిలమత్తూరు మండలంలో ఉన్న బంధువులకు అనంతపురానికి చెందిన రాము అనే వ్యక్తి ఇటీవల ఎన్నోసార్లు ఫోన్ చేయాలని ప్రయత్నించారు. అయితే ఎన్నిసార్లు ప్రయత్నించినా నాట్ రీచబుల్ అనే వాయిస్ తప్ప ఫోన్‌మాత్రం కలవలేదు. ఆఖరికి దగ్గర్లో తెలిసిన వారి ల్యాండ్‌లైన్‌ను ఫోన్ చేసి విషయం చెప్పాల్సి వచ్చింది. ఇదీ మండలంలోని మొబైల్ నెట్‌వర్క్‌ల పరిస్థితి. ఇలాంటి ఉదాహరణలు కోకొల్లలు ఉన్నాయి.





చిలమత్తూరు: మండలంలో మొబైల్ నెట్‌వర్క్‌లు సరిగా పనిచేయక వినియోగదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఫ్రీక్వెన్సీ వీక్‌గా ఉండటంతో సర్వర్ అన్ రీచబుల్ అని వస్తుండటంతో ప్రజలకు చుక్కలు కనబడుతున్నాయి.

కర్ణాటక సిగ్నల్స్‌తో సతమతం

చిలమత్తూరు మండలం కర్ణాటక సరిహద్దుల్లో ఉంది. దీనికి తోడు సమీపంలోని బాగేపల్లి సెల్ సిగ్నల్స్ వస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎటు వైపు వెళ్లినా సిగ్నల్స్ సమస్యలు వేధిస్తున్నాయి. ముఖ్యంగా చిలమత్తూరు మండల కేంద్రానికి సమీపంలోని మరవకొత్తపల్లి, కొడికొండ చెక్‌పోస్ట్, కొడికొండ, పలగలపల్లి , సోమఘట్ట పంచాయతీల్లో కర్ణాటక నెట్‌వర్క్ వస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. అత్యవసర ఫోన్లు మాట్లాడాల్సి ఉన్నా సిగ్నల్స్ లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొడికొండ చెక్‌పోస్ట్‌లోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ పరిసరాల్లో బ్యాంక్ లావాదేవీలకు ఏదైనా ఓటీపీ అవసరమైనా కూడా ఓటీపీ రాక ఇబ్బందులు పడుతున్నారు. వినియోగదారులు ఎన్నిసార్లు ఎయిర్‌టెల్, జియో తదితర సంస్థలకు ఫిర్యాదు చేసినా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని ప్రజలు వాపోతున్నారు.

కొత్త సమస్య సర్వర్ అన్‌రీచబుల్

మొబైల్ నెటవర్క్‌లలో సర్వర్ అన్‌రీచబుల్ సమస్య తీవ్రతరమవుతోంది. అత్యవసర సమయాల్లో 108, 104 వంటి వాహనాలకు ఫోన్ చేయాలన్నా సర్వర్ సమస్య పట్టిపీడిస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. సిగ్నల్ సరిగా లేకపోవడమూ కూడా పెద్ద సమస్యగా మారింది. వందలాది రూపాయలతో రీచార్జ్‌లు చేయించుకుంటున్నా మొబైల్ నెట్‌వర్క్ సంస్థలు నెట్‌వర్క్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా నెట్‌వర్క్ ఫ్రీక్వెన్సీ, సిగ్నలింగ్ వ్యవస్థను మెరుగుపరచాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఒక్క పాయింట్ ఉంటే ఒట్టు



మొబైల్ నెట్‌వర్క్‌లు మరీ అధ్వాన్నంగా తయారయ్యాయి. ఇంట్లో ఉంటే ఇక అంతే సంగతులు. ఎవరైనా ఫోన్ చేసినా ప్రయోజనం ఉండదు. పలుమార్లు నెట్‌వర్క్ సంస్థలకు ఫిర్యాదులు చేసినా ఏమాత్రం పట్టించుకోలేదు. వందలాది రూపాయలు రీచార్జ్‌లు చేయించుకుంటున్నాం. నెట్‌వర్క్‌లే లేకపోతే అత్యవసర పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో అర్థం కావడం లేదు. - శంకర్‌రెడ్డి, చేనేపల్లి

ఓటీపీలు కూడా రావడం లేదు



ఫ్రీక్వెన్సీ వీక్‌గా తక్కువగా ఉండటం కర్ణాటక సిగ్నల్స్ వస్తుండటంతో సెల్‌కు ఫోన్లే రావడం లేదు. అత్యవసరమైన మొబైల్ ఓటీపీలు కూడా రాకుండా పోతుండటంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఒకరికి ఫోన్ చేయాలన్నా, మాకు ఫోన్ రావాలన్నా ఇంటి నుంచి బయటకు రావాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా సెల్ సిగ్నల్స్ సమస్యను పరిష్కరించాలి. - కుళ్లాయప్ప, కల్లుకుంట

నేడు ఎమ్మెల్యే పర్యటన

పరిగి: ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ మండలంలో బుధవారం పర్యటించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి తెలిపారు. మండల కేంద్రంలోని శుద్ధ జల కేంద్రంతో పాటు ఊటుకూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

ఓటరు నమోదు వేగవంతం చేయండి

చిలమత్తూరు: ఓటరు నమోదును వేగవంతం చేయాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి, డీటీ రెడ్డిశేఖర్ బీఎల్ఓలకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగరాజుతో కలిసి ఆయన బీఎల్ఓలతో సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో వీఆర్ఓలు, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్.లోచర్లలో పంట కోత ప్రయోగం

రొద్దం: మండల పరిధిలోని ఆర్ లోచెర్ల గ్రామంలో మంగళవారం కంది పంట ప్రయోగాలు నిర్వహించారు. ఏడీఏ స్వయంప్రభ పర్యవేక్షణలో రైతులు సుధార్‌రెడ్డి, నరేష్, రామకృష్ణారెడ్డి తదితరుల పొలాల్లో కంది పంటను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పొలంలో కొలతలు వేసి కంది పంట దిగుబడి శాతాన్ని గుర్తించారు. కార్యక్రమంలో ఏఓ నివేదిత, ఏఈఓ అంజద్, వీఏఏ మేఘన, ఇన్సూరెన్స్ అధికారి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాగి నర్సరీ పరిశీలన

లేపాక్షి: మండలంలోని కుర్లపల్లికి చెందిన శ్రీరామప్ప అనే రైతు పొలంలో రాగి నర్సరీని వ్యవసాయాధికారి శ్రీలత, అగ్రికల్చర్ అసిస్టెంట్ రఘు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తెగులు నివారణకు పలు సూచనలు, సలహాలిచ్చారు.

నరసమ్మ మృతికి సంతాపం

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆర్ ఆనంతపురం గ్రామ పంచాయతీ వైఎస్సార్ సీపీ సర్పంచ్ అంజినమ్మ అత్త నరసమ్మ (78) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ తాలుకా బూత్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, మండల ఎస్సీ సెల్ నాయకుడు జమ్మనిపల్లి మూర్తి, మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్రయాదవ్, తాలుకా బీసీ సెల్ నాయకుడు తిమ్మప్ప, నాయకులు వెంకటేష్, రామాంజప్ప తదితరులు ఆమె మృతదేహంపై పూలమాలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా మారెమ్మ ఉత్సవం


జ్యోతులు తీసుకెళ్తున్న మహిళలు

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి గ్రామంలో మంగళవారం ఘనంగా మారెమ్మదేవి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తమ ఇళ్ల నుంచి ప్రత్యేకంగా పిండితో తయారు చేసిన జ్యోతులను మోసుకుని గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా డప్పు వాయిద్యాలతో గొల్లమారనహళ్లి రోడ్డులో వెలసిన మారెమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం మహిళలు జ్యోతులను అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా వచ్చిన బంధువులు, స్నేహితులకు విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు.

'ఆడుదాం ఆంధ్రా' నమోదు చేయించండి

రొళ్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీల్లో భాగంగా ఆసక్తి ఉన్న వారితో రిజిస్ట్రేషన్ల నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని పెనుకొండ గ్రామ వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని హొట్టేబెట్ట, ఎం.రాయాపురం, బీజీహళ్లి సచివాలయాలను ఆయన ఈఓఆర్డీ క్రిష్టప్పతో కలిసి పర్యటించారు. ఆయా సచివాలయాల్లో రికార్డులు తనిఖీ చేశారు. ఈ–సర్వీసెస్ పై ఆరా తీశారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ బుధవారం సాయంత్రంలోపు క్లస్టర్ వారీగా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే అన్ని వర్గాలకు న్యాయం

హిందూపురం: పేదల సంక్షేమం, ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి సంక్షేమ పాలన అందిస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. మంగళవారం మున్సిపాల్టీ పరిధిలోని 15వ వార్డులో కౌన్సిలర్ షాజియా, 16వ వార్డులో ఇన్‌చార్జి ఫరూక్ అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ ఏ బ్లాక్ కన్వీనర్ సాధిక్, జేసీఎస్ కన్వీనర్లు శివశంకర్‌రెడ్డి, నౌషాద్ ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా నాలున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు వివరించే డిస్‌ప్లే బోర్డును చైర్‌పర్సన్ ఇంద్రజ ఆవిష్కరించరించి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మరోసారి మభ్యపెట్టిందుకు టీడీపీ అధినేత చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్ మారుతీరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్లు లక్ష్మినారాయణ, రవీంద్రుడు, కౌన్సిలర్లు శివ, ఆసీఫ్, ఆయుబ్, సునీత, నాగేంద్రమ్మ, మణీ, మల్లికార్జున, రోషన్‌అలీ, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు, చాందు, మల్లికాబాను, మస్తాన్, సుభాష్‌గాంధీ, భారతీ, బాను, కవిత తదితరులు పాల్గొన్నారు.

తూమకుంటలో...

హిందూపురం అర్బన్: ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తూమకుంట గ్రామ సచివాలయంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. మధుమతిరెడ్డి మాట్లాడుతూ ప్రజల ఇంటిముంగిటకే సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఒక్క సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ప్రజలందరూ మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో చంద్ర, తిమ్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాము, గిరి తదితరులు పాల్గొన్నారు.


హిందూపురం: మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ

గుడిబండ: మండల పరిధిలోని ముతుకూరు–1లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ జగదాంబ క్రిష్టప్ప మాట్లాడుతూ అన్ని వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమ న్యాయం చేస్తున్నారన్నారు. మరోసారి సీఎంను ఆశీర్వదించాలని కోరారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. పేదల అభ్యున్నతే ముఖ్యమంత్రి లక్ష్యమని, పేదలు మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని ఎంపీటీసీ సుశీల కోరారు.

శంకరగల్లులో...

మండల పరిధిలోని శంకరగల్లు గ్రామంలో వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగప్ప ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాలుగున్నరేళ్ల ప్రభుత్వ పాలనలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మంచిని వివరించారు.


హిందూపురం: కిట్లను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి

మరవకొత్తపల్లిలో...

చిలమత్తూరు: ప్రజా సంక్షేమమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మండలంలోని మరవకొత్తపల్లి (చిలమత్తూరు–2) గ్రామ సచివాలయం వద్ద ''వై ఏపీ నీడ్స్ జగన్'' కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయంలో పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలన్నీ సీఎం జగన్ అమలు చేశారన్నారు. అనంతరం సర్వే కిట్లను వలంటీర్లకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సంధ్య, ఈఓఆర్డీ ఈశ్వరయ్య, జేసీఎస్ కన్వీనర్ శంకర్‌రెడ్డి, నాయకులు రవీంద్రరెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, నయిముల్లా, కార్యదర్శి కుళ్లాయప్ప, వలంటీర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తమ్మడేపల్లిలో...

అమరాపురం: మండల పరిధిలోని తమ్మడేపల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం సర్పంచ్ గిరిజమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ వీరక్యాతరాయప్ప, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. రాబోవు సాధారణ ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ముఖ్యంగా ఆయన అందించిన పథకాలను వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ తీసుకెళ్లి వివరించాలన్నారు. సచివాలయం పరిధిలో నాలుగు సంవత్సరాలుగా ప్రజలకు చేకూరిన లబ్ధికి సంబంధించి డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను సర్పంచ్ గిరిజమ్మ, జెడ్పీటీసీ స్వారక్క, డైరెక్టర్ వీరక్యాతరాయ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.


గుడిబండ: సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచ్ జగదాంబ క్రిష్టప్ప


చిలమత్తూరు: మరవకొత్తపల్లిలో సర్వే కిట్లు వలంటీర్లకు పంపిణీ చేస్తున్న దృశ్యం


అమరాపురం మండలం తమ్మడేపల్లిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుడిసెలు తొలగించకపోతే చర్యలు

గోరంట్ల: మండల పరిధిలోని పాలసముద్రం సమీపంలో జాతీయ రహదారి పక్కన సర్వేనంబర్ 125లోని 6.76 సెంట్ల ప్రభుత్వ భూమిలో మంగళవారం సీపీఎం నాయకుల అండతో కొందరు గుడిసెలు వేశారు. విషయం తెలుసుకొన్న తహసీల్దార్ రంగనాయకులు సిబ్బందితో వెళ్లి సీపీయం నాయకుడు పెద్దన్నతో పాటు గుడిసెలు వేసుకున్న వారితో చర్చించారు. అక్రమంగా వేసిన గుడిసెలను వెంటనే తొలగించాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్హులైన పేదలు ఉంటే ప్రభుత్వమే అందరికీ పట్టాలు మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి సాయం చేస్తోందని స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే సీపీఎం నాయకుడు పెద్దన్న మాట్లాడుతూ పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే పట్టాలు ఇప్పించాలని కోరారు. వెంటనే ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేయాలని సంబంధిత వీఆర్ఓను తహసీల్దార్ ఆదేశించారు.


పాలసముద్రం సమీపంలో ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసిన దృశ్యం

ఆర్టీసీ డిపో ఎదుట నిరసన

హిందూపురం: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హిందూపురం డిపో ఆర్టీసీ ఉద్యోగులు మంగళవారం డిపో ఎదుట ఎన్ఎంయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఎన్ఎంయూ అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ యూనిట్‌లో ఉద్యోగులకు వార్షిక ఇంక్రిమెంట్లు ఏపీసీ, పిఆర్సీ బకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

తపాలా ఉద్యోగుల నిరసన

హిందూపురం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక పోస్టల్ డివిజనల్ కార్యాలయం ఎదుట హిందూపురం తపాలా ఉద్యోగులు విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంత వరకు నిరవధిక సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలిపారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి సచివాలయ ఆవరణలో బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే తిప్పేస్వామి హాజరవుతారన్నారు.

'నిషా' కార్మికుల నిరసన

గోరంట్ల: మండల పరిధిలోని గుంతపల్లి సమీపంలో వెలసిన నిషా గార్మెంట్స్‌లో పనిచేస్తున్న మహిళా కార్మికులు మంగళవారం వీధులను బహిష్కరించారు. జీతాలు పెంచాలని గార్మెంట్స్ ముందు ధర్నా చేశారు.

సంక్షిప్త సమాచారం

ఆందోళన చేస్తున్న వారికి సీఐటీయూ కార్మిక సంఘం నాయకులు మద్దతు పలికారు. ఎస్ఐ బాబు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం

సోమందేపల్లి: క్రీడాకారులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహిస్తోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం తెలిపారు. మంగళవారం ఎంపీపీ కార్యాలయం వద్ద గ్రామ సచివాలయాలకు మంజూరైన క్రీడా సామాగ్రిని సచివాలయ కార్యదర్శులకు వారు అందజేశారు.

లేపాక్షి: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామ సచివాలయాలకు క్రీడా కిట్లను జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి చేతులు మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ఒక్కో సచివాలయానికి 5 కిట్ల చొప్పున 12 సచివాలయాలకు 60 కిట్లను అందించారు.


వేంకటేశ్వరాలయంలో లక్ష దీపార్చన

భక్తిశ్రద్ధలతో లక్షదీపార్చన

హిందూపురం: కార్తీక అమావాస్యను పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక పేట వెంకటరమణస్వామి, శ్రీనివాసమందిరం, ఆర్‌పీజీటీలోని వేంకటేశ్వరాస్వామి ఆలయాలతో పాటు ముక్కిడిపేటలోని నిత్య కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అరేకటిక సంఘం ఆధ్వర్యంలో లక్షదీపార్చన నిర్వహించారు. ఆలయంలో మూలవిరాట్‌కు జ్వాలాదీపార్చన చేసి విశేషంగా పూజలు చేశారు.


గణనాథుడి రూపంలో ..


ముక్కిడిపేటలో వేంకటేశ్వరస్వామి


శివలింగం ఆకారంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు